క్లుప్తంగా

లంబోదరుడికి కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వెదురుకుప్పం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చవటగుంటలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో శుక్రవారం కుంకుమార్చన చేశారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ వితరణ చేశారు. ఆదివారం స్వామి వారి నిమజ్జన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

చెంచులక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

నింద్ర: మండలంలోని అత్తూరు పంచాయతీ ఎస్టీకాలనీలో చెంచులక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో గోవింద భజన



భజనలు చేస్తున్న గోవింద భక్తులు

నగరి: పెరటాసి నెలను పురస్కరించుకుని తమిళనాడు నుంచి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి పాదయాత్రగా వచ్చే గోవింద భక్తులు స్థానిక ఓం శక్తి ఆలయంలో శుక్రవారం పెద్ద ఎత్తున భజనలు చేశారు. గోవింద సంకీర్తనలతో భక్తిభావాన్ని చాటారు. ఆలయ నిర్వాహకులు గోవింద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, జ్యోతి నాయుడు, మురళీమోహన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన

నింద్ర: పంట సాగులో ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి తులసిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని అరూరులో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. వరి సాగుపై మొలకువలు, సూచనలు తెలియజేశారు. సస్యరక్షణతో వరిలో మంచి దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

ఎస్వీయూతో సుజన్ లైఫ్ ఒప్పందం



ఒప్పంద ప్రత్రాలు మార్చుకుంటున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: వెంకటేశ్వర విశ్వవిద్యాలయంతో సుజన్ లైఫ్ టైమ్స్ సంస్థ శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ కె.రాజారెడ్డి ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఆయన మాట్లడుతూ డ్రగ్స్ రీసర్చ్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ రంగాల్లో లైఫ్‌టైమ్స్ సంస్థతో కలిసి పనిచేస్తామన్నారు. రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ ఉన్నారు.

ముక్కంటి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



గురుదక్షిణామూర్తి సన్నిధిలో జస్టిస్ రామకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనాలు ఇచ్చి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి కథనం మేరకు, వెంకటగిరికి చెందిన తేజ(43), సుబ్రమణ్యం(41) ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయల్దేరారు. మార్గమధ్యంలో అంజిమేడు వద్ద కారును తప్పించబోయి అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె ముంగిటకే పాలన

- వైఎస్సార్‌సీపీతో గ్రామాల అభివృద్ధి బాట
- స్థానికంగానే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం
- ప్రజలకు సత్వర సేవలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చేందుకు అనేక చర్యలు చేపట్టింది. పట్టణాలకు వెళ్లకుండా ప్రజలకు పల్లెల్లోనే ప్రభుత్వ సేవలు అందిస్తోంది. పేదల సంక్షేమం, ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పింఛన్లు, సంక్షేమ పథకాలు చేరవేస్తోంది. గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం ద్వారా ప్రజలు సత్వర సేవలు పొందుతున్నారు.



పన్నూరులో నిర్మించిన ఆర్‌బీకే కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా (ఫైల్)

విజయపురం(నగరి): వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారు. అవినీతికి తావులేకుండా, రాజకీయ పార్టీలనే భేదం చూపకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. దాదాపు 35 ప్రభుత్వ శాఖల నుంచి 500 పైగా సేవలను కేవలం 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పరిష్కరిస్తున్నారు. రూ.40 లక్షలతో గ్రామ సర్పంచ్, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వేల్ఫేర్, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ప్రజలు వీక్షించేందుకు ప్రత్యేక భవనం, ఇలా వివిధ శాఖలకు సంబంధించి ప్రత్యేకంగా గదులను సుందరగా నిర్మించారు.



విజయపురం పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్న 108

గ్రామీణులకు మెరుగైన వైద్యం

గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలని రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 65 రకాల మందులు, టెలి మెడిసిన్ సేవలు, 67 రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు అక్కడే ఉంటారు. పల్లెల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు కావడంతో 24 గంటలూ వైద్యసేవలు అందనున్నాయి. అన్ని రకాల టీకాలు, గర్భిణులకు వైద్యంతో పాటు సుమారు 90 రకాల మందులు అందుబాటులో ఉంచనున్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు వెంటనే అందించేందుకు ఆధునాతన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనాల ద్వారా వైద్యులు గ్రామాల్లో ప్రజల చెంతకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. బీపీ, షుగర్, రెగ్యులర్ చెకప్‌లను పైసా ఖర్చు లేకుండా పొందొచ్చు.

రైతుల చెంతకే సేవలు

ప్రభుత్వం, రైతులకు మధ్య దళారీ వ్యవస్థ బెడద లేకుండా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. ఆర్బీకే సిబ్బంది పంటల సాగులో సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. డిజిటల్ కియోస్క్ సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, ఆధునిక సమాచారం, ధరలు తదితర సేవలు ఆర్బీకేల ద్వారానే అందుతున్నాయి.

ఆయుష్మాన్‌భవతో మెరుగైన వైద్య సేవలు



ఆయుష్మాన్‌భవ కార్డులను విడుదల చేస్తున్న ఎంపీపీ, సూపరింటెండెంట్

కార్వేటినగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్‌భవ పథకంతో మెరుగైన వైద్య సేవలు పొందవచ్చని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మితో కలిసి ఆయుష్మాన్‌భవ పథకాన్ని ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భవ కార్డులను ఆవిష్కరించారు.

ఉపాధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా ఉండాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ అన్నారు. శుక్రవారం వెంగళరాజుకుప్పంలో ఏపీఓ మార్గేట్‌తో కలిసి ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదిలో 100 రోజులు పనులు కల్పిస్తామని తెలిపారు. సకాలంలో బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. పనులు చేస్తున్న ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు శ్రీరామరక్ష అని.. అందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి పల్లవి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేయాలన్నారు. అనంతరం శ్రీరంగరాజపురం సచివాలయం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి 382 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ హరిత, నాయకులు జనార్దన్, కుప్పయ్య, శ్రీధర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు

విజయపురం (నగరి): ప్రతి రైతు ఈ నెల 30వ తేదీలోగా ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ చేసుకోవాలని ఏఓ రజినికుమారి అన్నారు. మండలంలో 90 శాతం ఈ క్రాప్ నమోదు చేశామని.. మిగిలిన రైతులు కూడా త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోయే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సకాలంలో పరిహారం అందుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గంగాధరనెల్లూరు: మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో వేల్కూరు మిట్ట వద్ద శుక్రవారం ఇన్నోవా, స్కూటర్‌ను ఢీ కొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వేల్కూర్ వద్ద శ్రీరంగరాజపురం మండలం పాదలపల్లి గ్రామానికి చెందిన అఖిల్ ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు వెళుతుండగా అదే మార్గంలో వస్తున్న ఇన్నోవా అదుపుతప్పి అతడిని ఢీ కొంది. దీంతో అఖిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులకే అనుమతి



శ్రీనివాస సేతు బస్టాండ్‌కు వెళ్లే మార్గం

తిరుపతి అర్బన్: శ్రీనివాస సేతు బ్రిడ్జి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లోకి ఏర్పాటుచేసిన మార్గంలో ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉందని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు వస్తుండడంతో ఆర్టీసీ సర్వీసులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందని తెలిపారు. మిగతా ప్రాంతాల్లో అన్ని వాహనాలు శ్రీనివాస సేతుపై వెళ్లడానికి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

ఆక్రమణలను తొలగించకుంటే చర్యలు



ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పుత్తూరు రూరల్: మార్కెట్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమణలను శుక్రవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కేఎల్ఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇది వరకే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని పలుమార్లు హెచ్చరించామని తెలిపారు. అయినా పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలను తొలగించినట్లు వివరించారు. అలాగే పట్టణంలోని నగరం రోడ్డు, తిరుపతి–నగరి రోడ్డులో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మించిన తాత్కాలిక కట్టడాలు, రేకుల షెడ్డులను తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. రోడ్లకు ఇరువైపులా తోపుడు బండ్లు, తాత్కాలిక షెడ్లు, వ్యాపార ప్రకటన బోర్డులను తొలగించాలని సూచించారు. ఆక్రమణల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో ఆక్రమణలను తొలగించకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ

క్లీన్ మున్సిపాలిటీగా పుత్తూరును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ కోరారు. వ్యాపారులు రోడ్లపైనే చెత్తను పడేస్తున్నారని, ఇలాంటి వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. డస్ట్‌బిన్స్‌లో చెత్త వేసుకుని, మున్సిపాలిటీ వాహనం వచ్చినప్పుడు సిబ్బందికి అందజేయాలని సూచించారు. పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించాలని యజమానులకు సూచనలిచ్చారు. మిగిలిపోయిన పదార్థాలను ఫ్రిడ్జిల్లో ఉంచి విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రతి హోటల్‌లో కమిషనర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్లను ఉంచాలని ఆదేశించారు.



మార్కెట్ వద్ద ఆక్రమణల తొలగింపు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: మండలంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రవేశపెట్టిన నాడు–నేడు పథకం ద్వారా మంజూరైన పాఠశాలల పనులను అక్టోబర్ ఆఖరిలోపు పూర్తి చేయాలని తెలిపారు. అలాగే పక్కాగృహాలను సామూహిక గృహ ప్రవేశాలకు ముందే పూర్తి చేయాలని, ఎన్ఆర్ఈజీఎస్ పనులను నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంఈఓ విజయకుమార్, సర్పంచ్ ధనంజయవర్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఏపీఓ జాహ్నవి, ఏపీఎం విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరీష్‌కుమార్, బాలజీ, అగ్రికల్చర్ ఏఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

కోలాహలం.. వినాయక నిమజ్జనం



శ్రీకావేరిరాజుపురం కొత్త చెరువులో నిమజ్జనానికి తీసుకొచ్చిన గణేష్ విగ్రహం

పాలసముద్రం: జై వినాయక.. జై బోలో గణేశ్ మహరాజ్‌కు జై అంటూ నినాదాలతో శుక్రవారం పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండపాల్లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలకు ఐదు రోజుల పాటు పూజలు చేశారు. పాలసముద్రం, ఏటూకూరిపల్లె, వెంగళరాజుకుప్పం, ఆముదాల, శ్రీకావేరిరాజుపురం గ్రామాల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు. విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామాల్లో ఊరేగించారు. డప్పు వాయిద్యాల నడుమ యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. టెంకాయలు కొట్టి కర్పూర హారతులిచ్చి నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం పూర్తి చేశారు.

ఎన్‌సీసీకి 27మంది ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్‌సీసీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థుల ఎంపిక ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ 29వ బెటాలియన్ సుబేదార్ బాలకృష్ణ, బహదూర్ పర్యవేక్షణలో కళాశాల ఏఎన్ఓ లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో 27 మంది ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, అందులో ఉన్నవారు జాతీయ సేవకు సిద్ధంగా ఉండే బాధ్యతాయుత పౌరులన్నారు. ఎన్‌సీసీలో ప్రవేశాన్ని విద్యార్థులు గర్వంగా భావించాలన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మహిళలు డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్రలు, వీఓలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధిని మెరుగుపరిచే బాధ్యత మహిళలపై ఉందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన స్త్రీనిధికి పూర్తిస్థాయి యజమానులు మహిళలేనని తెలిపారు. బ్యాంకు లింకేజీ ద్వారా అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేత కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని వినతి



సీఈఓ సునీతకు నివేదికను అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్

పుత్తూరు రూరల్: నగరి నియోజకవర్గంలో 50 ఏళ్లు నిండిన పవర్‌ల్యూమ్స్(నేత) కార్మికులు దయనీయ స్థితిలో ఉన్నారని, వీరికి పింఛన్లు మంజూరు చేయాల్సిందిగా పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విజయవాడలో జౌళి పరిశ్రమలు, వాణిజ్య శాఖ సీఈఓ కె.సునీతకు మంత్రి రోజా నేతృత్వంలో పుత్తూరు సెంగుంధర్ మక్కల్ నల సంఘం నాయకులు నివేదికను అందజేశారు. నేత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్న సుమారు 200 మంది కార్మికులు ఒకటి, రెండు మగ్గాలతో సరిపడ ఆదాయం లేక కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. వీరందరూ కరోనా మహమ్మారి కారణంగా జీవనోపాధిని కోల్పోయారన్నారు. ప్రస్తుతం వీరందరూ వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని వివరించారు. వీరి దయనీయ స్థితిని గుర్తించి పింఛన్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. ఈ మేరకు సీఈఓకు మంత్రి రోజా ఇచ్చిన లేఖను పుత్తూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్, సెంగుంధర్ మక్కల్ నల సంఘం నాయకులు శివశంకర్, గోపిరమణ, ఏకాంబరం, దిలిప్‌మొదలి అందజేశారు.

నేటి నుంచి సైన్స్ సెంటర్ వార్షికోత్సవాలు

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్ 30వ వార్షికోత్సవాన్ని శనివారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ ఒక ప్రకటనలో తెలిపారు. 1993 సెప్టెంబర్ 23న సైన్స్ సెంటర్ ప్రారంభమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం పునరుద్ధరించిన హెర్బల్ గార్డెన్‌తో పాటు కేంద్రం ఒక వార్షికోత్సవ పోస్టల్ స్టాంప్, సైన్స్ క్విజ్ పోటీని, కొత్త సైన్స్ షోను విద్యార్థుల కోసం ప్రారంభించనున్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హెర్బల్ గార్డెన్ ప్రారంభోత్సవం, ఆర్ఎస్‌సీ తిరుపతి వార్షికోత్సవ స్టాంప్ విడుదల కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 24న సాయంత్రం 4 గంటలకు సైన్స్ షో ప్రారంభం, 25న ఉదయం 11 గంటలకు సందర్శకుడికి రివార్డ్ ఇవ్వడం, 26న మధ్యాహ్నం 2 గంటలకు సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై ఇంటర్ స్కూల్ టీమ్‌వైజ్ సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 27న మధ్యాహ్నం 2 గంటలకు ఓపెన్ హౌస్ సైన్స్ క్విజ్ పోటీ, అదే రోజు 3 గంటలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

గ్రాప్లింగ్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికలతో జిల్లా చీఫ్ కోచ్

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శుక్రవారం గ్రాప్లింగ్ జూనియర్, సీనియర్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జూనియర్, సీనియర్ కేటగిరిలో బాలబాలికలు హాజరయ్యారు. వీరికి వేర్వేరుగా పోటీలు నిర్వహించి, ప్రతిభకనబరిచిన 30 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేంద్రా రెడ్డి తెలిపారు. జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23, 24 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించనున్న 3వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారన్నారు. క్రీడాకారులను జిల్లా చీఫ్ కోచ్ సయ్యద్‌సాహెబ్ అభినందించారు. ఈ పోటీలకు డీ.సాయిసుమతి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.